ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-చేబ్రోలు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జేసీఎస్ చేబ్రోలు మండల కన్వీనర్ కుర్ర పాములు పేర్కొన్నారు. మండల పరిధిలోని వేజండ్ల సచివాలయంలో బుధవారం జగనన్న సురక్షత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి పేదవాడికి అండగా ఉండాలనే ఆలోచనతో జగనన్న సురక్షత కార్యమాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉచితంగా సచివాలయంలో 9 రకాల ధృవీకరణ పత్రాలు అందిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దినేష్, శ్రీనివాసరావు, ఈశ్వరరెడ్డి, ముత్తేశ్వరావు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఘనంగా యోగా డే

విశాలాంధ్ర-తాడేపల్లి: శారీరక,మానసిక రుగ్మతలనుండి మనిషి తనను తాను విడిపించుకోవడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఇషా ఫౌండేషన్ మెంటార్ జగదీష్ అన్నారు. బుదవారం కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలోని సాక్ హాలులో జరిగిన 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 22వ ఆంధ్రా బెటాలియన్ కు చెందిన ఎన్ సిసి క్యాడెట్లతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు నేర్చుకున్నారు.ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా, సామాజికంగా అభివృద్ధి సాదించడానికి ప్రతీ ఒక్కరు యోగాభ్యాసం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో విసి డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్లానింగ్ మరియు అభివృద్ధి డీన్ డాక్టర్ వి.రాజేష్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ చప్పిడి హనుమంతరావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, ప్లానింగ్ మరియు అభివృద్ధి అసోసియేట్ డీన్ బ్రహ్మాచారి, యోగా గురువులు హరిపోతులూరు, ఎం.పూజిత, ఎన్ సిసి కల్నల్ వి.మౌనిక, సాక్ సమన్వయ కర్తలు సత్యన్నారాయణ,వంశి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఎపి మోడల్ స్కూల్ లో తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ నిమిత్తం ధరఖాస్తుల స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.రవినాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరములో 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ నిమిత్తం ధరఖాస్తుల స్వీకరిస్తున్నామని అన్నారు. ఈ నెల 23వరకు విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుంది. ఆయా తరగతులకు ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 26న ప్రవేశ పరీక్ష జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం వారి రిజర్వేషన్లకు లోబడి, మెరిట్ మార్కులు ప్రకారం సీట్లు కేటాయించటం జరుగుతుందని అన్నారు. సీట్లు పరిమితంగా ఉన్నాయని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమర్‌నాథ్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల: పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ ను అతికిరాతకంగా పెట్రోలుపోసి నిప్పంటించి చంపిన నిందితులను పోలీస్ అధికారులు కేసు విచారణ వేగవంతం చేసి నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించేలా అధికారులు చర్యలు చేపట్టాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు డా?గోదా రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్ లో జరిగిన విలేకరుల సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి అమర్నాథ్ తన అక్కను వేధిస్తున్న యువకులను వేధించవద్దని వేడుకోగా నలుగురు యువకులు అమర్నాథ్ పై పెట్రోలు పోసి నిప్పంటించి అతికిరాతకంగా చంపడం దారుణమని తక్షణమే కేసులో నిందితులైన పామువెంకటేశ్వరెడ్డి,గోపిరెడ్డి,సాంబిరెడ్డి,వీరబాబులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ వేగవంతం చేసి నిందితులకు త్వరగా శిక్షపడే విధంగా అధికారులుకృషిచేయాలన్నారు.తక్షణమే అమర్నాథ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలనష్టపరిహారం,కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీబీహెచ్ పీయస్ నాయకులు శ్రీనివాసరావు,యేసుదాసు,విజయకుమార్,వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్‌లో అంతర్జాతీయ యోగ డే

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు: స్థానిక కిట్స్ కాలేజీలో 9 వ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు యోగాలో పాల్గొన్నారు జరిగింది కళాశాలకు చెందిన ఎన్సిసి విభాగం మరియు ఎన్సిసి సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. యోగా శిక్షకులు టీ తేజ మెడిటేషన్ శిక్షకులు రామకోటేష్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు ప్రారంభించారు. యోగ అభ్యాసం ద్వారా నేటి తరం విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించవచ్చు అన్నారు. భవిష్యత్తు లక్ష్యాలను మన సును లగ్నం చేయడం ద్వారా సాధించవచ్చు చెప్పారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ ప్రిన్సిపల్ డాక్టర్ పి బాబు అకాడమిక్ డైరెక్టర్ కే హరిబాబు పాల్గొన్నారు.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా తెలయజేయునది ఏమనగా ది.24-6-2023 శనివారం మ॥ 3 గం॥లకు మంగళగిరి బ్రాంచి నందు 92.00 గ్రాములు కుదవ పెట్టిన పాతబంగారు నగలు మా మంగళగిరి బ్రాంచ్ ఆఫీస్ నందు వేలం వేయబడుచున్నవి. వేలం వేయబడుచున్న నగలు వినియోగదారుల సమయం దాటిపోయినందున, వారందరికి మా వేలం పాట ప్రకటనలు రిజిష్టర్ పోస్టు ద్వారా పంపడం జరిగినది. వేలం పాటలో పాల్గొనే వ్యక్తి తమ అడ్రస్ ప్రూఫ్ & ఐ.డి.ప్రూఫ్ వెంటతీసుకుని రావలెను. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి వుంటుంది. నిబంధనల కొరకు దయచేసి మా ఆఫీసు నందు సంప్రదించగలరు.

అరుణా ఫైనాన్స్ లిమిటెడ్

డోర్ నెం. 07-547, గుంటూరు రోడ్డు, మంగళగిరి-522503, గుంటూరు జిల్లా.

సెల్: 88851 22355

CHANGE OF NAME

I, **YARAGANI SRINIVASA RAO** (Old Name) S/o. (Late) **YARAGANI SATYANARAYANA**, R/o. D.No.12-11-584, 2nd Lane Ramireddy Thota, Behind Nagarjuna Nursing Home, Guntur - 522001, Guntur District, Andhra Pradesh, have changed my name to **YARAGANI SREENIVASA RAO**. Hereafter my name is known as **YARAGANI SREENIVASA RAO**.

CHANGE OF NAME

I, **JAMPANI JYOSTNA DEVI** (Old Name) W/o. SAMINENI ANTHONY RAJ, R/o. D.No.54-17-3085, Rahul Gandhi Nagar 6th Lane, C.I. Gari House, R.T.C. Colony, Guntur - 522001, Guntur District, Andhra Pradesh, have changed my name to **SAMINENI JYOTHSNA DEVI**. Hereafter my name is known as **SAMINENI JYOTHSNA DEVI**.

యోగాలో భారత్ విశ్వ గురువు

విశాలాంధ్ర- బెల్లంకొండ: బెల్లంకొండ మండల కేంద్రంలోని చిట్టిప్రోలు కాశమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్లో యునైటెడ్ నేషనల్ ఆర్గనైజేషన్ వారి ఆదేశాల మారకు మెంబర్ లుగా ఉన్న 185 దేశాలు కూడా యోగా దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆయుష్ వైద్య అధికారి ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం జరిపారు. పలువురు ఓంకారం చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు ఈ సందర్భంగా జడ్పిటిసి గాదె వెంకటరెడ్డి పలువురు మాట్లాడుతూ యోగా అనగా శరీరం మనసు ఆత్మల కలయిక ఈ మూడు కలిసినప్పుడు చేసే యోగ సాధన మాత్రమే ప్రయోజనాన్ని ఇస్తుందన్నారు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు నాయకులతో కలిసి యోగ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరెడ్డి, హెచ్ఎం ఎన్ శాంతి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గడిపర్తి చినబాబురావు పాల్గొన్నారు.

‘భవిష్యత్‌కు గ్యారంటీ’ ప్రజలకు వివరించాలి : కోవెలమూడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ లోని సంక్షేమ పథకాలు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించాలని తద్వారా ఆ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో వారికి అర్థమయ్యేలా చెప్పి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడం ద్వారా రాష్ట్రానికి జరిగే మేలును తెలియజేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర(నాని) కోరారు. బుధవారం స్థానిక పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర, నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి ఆధ్వర్యంలో వార్డు ప్రెసిడెంట్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యేవరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. కనకాచారి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు తగు న్యాయం జరుగుతుందని, టీడీపీ ప్రకటించిన సంక్షేమ పథకాల ద్వారా వారి ఆదాయం రెట్టింపు అవుతుంది అని అన్నారు. సమావేశంలో ముత్తినేని రాజేష్, కసుకుర్తి హనుమంతరావు, సింగంశెట్టి వీరయ్య, వడ్లమూడి వెంకటేశ్వరావు, తెల్లగొర్ల అప్పారావు, మానం శ్రీనివాస్, గుడపాటి రమేష్, పోపూరి నరేంద్ర, కన్నసాని బాజీ, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తులసి రామచంద్ర ప్రభు, కృష్ణ చైతన్య పుట్టినరోజు



విశాలాంధ్ర-గుంటూరు: ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు, ఆయన కుమారుడు తులసి కృష్ణ చైతన్యల జన్మదిన వేడుకలు బుధవారం రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, అభిమానుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగాయి. స్థానిక రాజేంద్రనగర్‌లోని తులసీ రామచంద్ర ప్రభు స్వగృహంలో ఏర్పాటుచేసిన జన్మదిన భారీ కేక్‌ను రామచంద్ర ప్రభు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నేతలు వారిని గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. భవిష్యత్తులో తులసి గ్రూప్ సంస్థలు మరింత పురోభివృద్ధి చెందాలని, పారిశ్రామికవేత్తగా రామచంద్ర ప్రభు, చైతన్యలు మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి తులసి సంస్థలు బాసటగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరి సహకారంతో, అకుంఠిత దీక్షతో తులసి సంస్థలు ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయన్నారు. పేద విద్యార్థులకు 25 ఏళ్లకు పైగా ఉపకారవేతనాలు అందిస్తున్నామని, మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేయాలనే ఉద్దేశంతోనే పార్టీలో చేరామని తెలిపారు.

తులసి కార్పొరేట్ కార్యాలయంలో జన్మదిన వేడుకలు: తులసి గ్రూప్ సంస్థల అధినేతలు తులసి రామచంద్ర ప్రభు, తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు అరండల్‌పేటలోని తులసి సంస్థల కార్యాలయంలో సంస్థ ఉద్యోగులు, తులసి అభిమానుల సమక్షంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. రామచంద్ర ప్రభు భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బాటసారులకు తులసి సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే అభిమాని బొందలపాటి రాజు ఆధ్వర్యంలో చినపలకలూరు పోలేరమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో పేద వృద్ధ మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మిరియాల శ్రీనివాస్, దళవాయి సుబ్రహ్మణ్యం, కనకం నరసింహారావు, తోట రామకృష్ణ, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, మల్లిశెట్టి సుబ్బారావు, ఇస్కాన్ ప్రచారకులు అప్పిశెట్టి రంగారావు, అడపా మాణిక్యాలరావు, దర్శనపు శ్రీనివాస్, వనమా నరేంద్ర, మాదాసు వెంగళరావు, వివేకానంద శ్రీనివాసరెడ్డి, రామ్మోహనరావు, హోమియో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నల్లపాటి పిచ్చయ్య, దాసరి లక్ష్మి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన మహాత్మాగాంధీ ఆస్పత్రి వైద్యులు

విశాలాంధ్ర-నరసరావుపేట: తీవ్రమైన గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో తమ ఆసుపత్రికి వచ్చిన అరవైయేళ్ళ మహిళకు అత్యాధునిక వైద్య చికిత్సలైన క్యాథ్ ల్యాబ్, నెక్ అండ్ బ్రెయిన్ యాంజియోగ్రామ్ నిర్వహించి 48 గంటల్లో ఆమె ప్రాణాలను కాపాడి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్టు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ కారసాని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్ట్రోక్ అనేది వైద్యపరమైన అత్యవసర పరిస్థితి అని పట్టణ పరిధిలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన బి.పాములమ్మ అనే వృద్ధురాలికి స్ట్రోక్ ప్రారంభమైన రెండు గంటలలోపు అత్యవసర పరిస్థితికి చేరుకుందని వారు వెంటనే తమ ఆసుపత్రికి రావటంతో యాంజియోగ్రామ్‌తో పాటు సిటీ స్కాన్ తీశామని ఆమె థ్రోంబొలిస్(క్లాట్ బ్రేకింగ్)తో పాటు ఆమె ముఖ్యమైన కరోటిడ్‌తో కనిపించిందని అన్నారు. ఇది అనేక మందికి గుండెపోటుకు ప్రధాన కారకమైన పరిస్థితి అన్నారు. తమ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాథ్ లాబ్ బ్రెయిన్ యాంజియోగ్రామ్ ఆమెకు పూర్తి చేశామని అప్పటికే ఆమె 80శాతం కంటే ఎక్కువ బ్లాక్‌తో ఉండటంతో ద్వైపాక్షిక కరోటిడ్ వ్యాధిగా గుర్తించి క్లోజ్ మానిటరింగ్ ద్వారా ఏకకాలంలో ద్విపార్శ్వక కరోటిడ్ స్టంటింగ్ శస్త్రచికిత్సలు నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడి 48 గంటల్లో వాకింగ్ స్టేట్‌లో డిశ్చార్జ్ చేశామని డాక్టర్ శ్రీనివాస రెడ్డి అన్నారు. నరసరావుపేట లాంటి పట్టణంలో ఇది అరుదైన శస్త్రచికిత్స విధానమని అన్నారు. ఈ సమావేశంలో న్యూరాలజిస్ట్ ప్రదీప్ రెడ్డి, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలనా వికేంద్రీకరణకు బదులు...అరాచక వికేంద్రీకరణ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: జగన్ పాలనలో నిత్యం హత్యలు, దాడులు, అత్యాచారాలతో రాష్ట్రం వల్లకాడులా మారిందని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో పాలనా వికేంద్రీకరణకు బదులు... అరాచక వికేంద్రీకరణ అవుతోందని ఎద్దేవాచేశారు. చిలకలూరిపేటలోని తన నివాసంలో ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. కారంపూడి మండల టీడీపీ అధ్యక్షుడిపై హత్యాయత్నం అప్రజాస్వామికమని అన్నారు. కారంపూడి ఘటనను మరువముందే నరసరావుపేటలో వ్యక్తి హత్య జరగడం... పల్నాడు ప్రాంతంలో శాంతిభద్రతల దుస్థితికి నిదర్శనమని మండిపడ్డారు. పల్నాడు ప్రాంతంలో తాలిబన్ల మాదిరి వైసీపీ గూండాలు రెచ్చిపోతున్నాయని ఆరోపించారు. పల్నాడును ఏం చేయాలనుకుంటున్నారో? ఈ హత్యా రాజకీయాలు ఎందుకో?.. సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పల్నాడును వల్లకాడు చేస్తున్నారని.. రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డి నాలుగేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను, విపక్షాలకు చెందిన ఎంతోమందిని వైసీపీ నేతలు క్రూరంగా హత్య చేశారని తెలిపారు. వైసీపీ రౌడీల చర్యలతో పల్నాడులో భయానక వాతావరణం నెలకొందని... ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పల్నాడుతో పాటు రాష్ట్రంలో ప్రతిరోజూ ప్రజలపై దాడులు, హత్యలు, మానభంగాలు జరుగుతున్నాయని తెలిపారు.

వైసీపీ నాలుగేళ్ల పాలనలో అంతా అవినీతి, అరాచకమే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. వైసీపీ వారు దాడులు చేస్తుంటే పోలీసులు మౌనంగా చూస్తున్నారని, గూండాలకు పోలీసులే స్వేచ్ఛనిచ్చినట్లు కనిపిస్తోందని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు మౌనాన్ని వీడాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-మేడికొండూరు: మేడికొండూరు మండలం వరగాని గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం రీ సర్వే పనులను బుధవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల రెడ్డి పరిశీలించారు. వరగాని గ్రామ సచివాలయంలో గ్రామ సర్వే రెవిన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి గ్రామంలో రి సర్వే జరుగుతున్న విధానంపై సమీక్షించారు. రీసర్వేకి సంబంధించి డ్రోన్ ఫ్లై, ఓ ఆర్ ఐ మ్యాపుల కొరలేషన్ గ్రాండ్ ట్రూత్ఇంగ్, భూ యజమానుల వివరాలు నమోదు, నోటీసులు జారీ తదితర అంశాలతో పాటు క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలు వాటిని పరిష్కరిస్తున్న విధానంపై అధికారుల నుండి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే లోభూ యజమానుల పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయాలని యజమానుల అభ్యంతరాలను పూర్తిస్థాయిలో విచారించే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ను పేదలందరికీ ఇళ్ల నిర్మాణ పురోగతి గ్రామ వ్యవసాయ సహాయకులను ఖరీఫ్ కు సంబంధించి ఆర్బికేల్లో విత్తనాలు ఎరువుల ముందస్తు నిల్వలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్.బి.కెలలో విత్తనాలు ఎరువుల కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యులు గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరాల తేదీల గురించి విస్తృతంగా ప్రచారం కల్పించి నిర్దేశించిన విధంగా గ్రామాలలో డాక్టర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. గ్రామంలో మంచినీటి చెరువు అభివృద్ధి గ్రామాల్లో కనెక్టివిటీ రోడ్లు ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్లు లో వోల్టేజ్ సమస్యలపై గ్రామస్తుల నుండి జిల్లా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి గ్రామ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఆర్డిఓ ప్రభాకర్ రెడ్డి, సర్వే శాఖ ఏడి నాగ శేఖర్, తహసిల్దార్ కరుణకుమార్ తో పాటు మండల సర్వే,రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డి పాలెం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది .వివరాల్లో వెల్లగా బెల్లంకొండ అడ్డరోడ్ నుండి బెల్లంకొండ వైపు ద్విచక్ర వాహనంపై న్యూ చిట్యాల గ్రామానికి చెందిన మొగిలి వెంకటేశ్వర్లు వస్తున్నాడు.క్రోసూరు నుండి బెల్లంకొండ అడ్డరోడ్డు వైపు వస్తున్న ఇసుక లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనం ద్వారా మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని 108 సిబ్బంది తెలిపారు. జరిగిన సంఘటనపై ఎస్సై వివరణ కోరగా పూర్తి వివరాలు అందలేదని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-తాడేపల్లి: క్రమం తప్పకుండా యోగా చేయటం వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని కెఎల్ విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ హనుమంతరావు అన్నారు.9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మనస్సు ఆరోగ్యంగా ఉంటేనే తనువు కూడా ఆరోగ్యంగా ఉంటుందని, వీటికి పరిష్కారం యోగాతో సాధ్యమని అన్నారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల యోగాసనాలు పై అవగాహన కల్పించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి శ్రీకాంత్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్, ఇసిఇ విభాగ అధిపతి డాక్టర్ ఎం.సుమన్, హాబీ క్లబ్ ఇన్చార్జి డాక్టర్ ఆర్. సుభాకర రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, వ్యాయామ అధ్యాపకులు కాంతారావు, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, సీఈఏ సమన్వయకర్త జీవీకేపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఆర్థిక విద్యలో విజేతలు

విశాలాంధ్ర-యడ్లపాడు: యడ్లపాడులోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజ న్యంతో బుధవారం ఆర్బీఐ వారు నిర్వహించిన ఆర్థిక విద్యపై క్విజ్ పోటీలలో మం డలంలోని లింగారవుపాలెం జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు జావీద్, సుశాంత్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. యడ్లపాడు జడ్పీహెచ్ పాఠశాలలో జరిగిన ఈ పోటీలలో యడ్లపాడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పూజిత, అనూషలు ద్వితీయస్థానం, ఇదే పాఠశాలలోని జయలక్ష్మి, శిరీషలు తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. కాగా పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లు అందచేశారు. పాఠశాల హెచ్ఎం విజయభారతి, బ్యాంక్ మేనేజర్ తిలక్‌లు పర్యవేక్షించారు.

నారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని 38వ వార్డులోని గంగమ్మ సుగాలికాలనీ(జిడ్డు కాలనీ)లో ఆర్థికంగా వెనుకబడిన 40 మంది టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.2 లక్షలు అందించారు. పార్టీ సీనియర్ నాయకులు జంగా వినాయకరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇరువురు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెరుకూరి కాంతయ్య, గంజి మోహన్, మాజీ కౌన్సిలర్ గాలం కోటేశ్వరరావు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి అబ్దుల్ మజీద్, నాదెండ్ల మాజీ ఎంపీపీ కాటా శ్రీధర్, మాజీ యడ్లపాడు గ్రామ టీడీపీ ప్రెసిడెంట్ పారా హరిబాబు, నాగభైరు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో అర్హులైన జరలిస్టులందరికి వెంటనే అక్రిడే షన్ కార్డులు మంజూరు చేయా లని విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతి రావు, సీనియర్ జర్నలిస్టు అబ్బూరి రమేష్‌లు జిల్లా పౌరసమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ అల్లూరి దీప్తిని కోరారు. నరసరావుపేట పట్టణంలో డీపీఆర్‌వో కార్యాలయంలో చలపతిరావు ఇటీవల పల్నాడు జిల్లా డీపీఆర్‌వో కార్యాలయానికి కడప జిల్లా నుండి బదిలీపై వచ్చిన డివిజనల్ డీపీఆర్‌వో ఓంప్రకాష్ రెడ్డి, డివిజనల్ పీఆర్వో ఎస్.రవికుమార్‌లను కలసి వారిని అభినందించారు. జర్నలిస్టులకు త్వరిగతిన అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

నేతన్న నేస్తం దరఖాస్తుకు జీఎస్టీ అక్కర్లేదు

విశాలాంధ్ర-మంగళగిరి: వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద దరఖాస్తు చేసుకునే చేనేత కార్మికులు జీఎస్టీ బిల్లులు నమోదు చేయవలసిన అవసరం లేదని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల వలన తొలుత జీఎస్టీ బిల్లులు సమర్పించాలనే నిబంధన అధికారులు పొందుపరిచారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నేత కార్మికుల ఇబ్బందులను తెలియజేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తక్షణమే స్పందించి జీఎస్టీ నిబంధనను ఎత్తివేసారని, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంలో కూడా జీఎస్టీ కాలమ్ తొలగించడం జరిగిందని చెప్పారు. కావున చేనేత కార్మికులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ నేతన్న నేస్తం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. జీఎస్టీ నిబంధన తొలగించి నేత కార్మికులకు వెసులుబాటు కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ధన్యవాదాలు తెలిపారు.

విజ్ఞాన్ నిరులా అధ్యాపకునికి డాక్టరేట్

విశాలాంధ్ర-గుంటూరు: గుంటూరు, పలకలూరు రోడ్‌లోని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న అయినంపూడి హరీష్‌కు విట్ విశ్వ విద్యాలయం, ఆంధ్రప్రదేశ్ వారు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు కళా శాల ప్రిన్సిపాల్ పి.రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దూళి రవీంద్ర పరిశోధన పర్యవేక్షనలో 'పెర్ ఫార్మన్స్ అనాలసిస్ ఆఫ్ స్కేలబుల్ యుజెర్ సెంట్రిక్ హెట్రో జీని యస్ క్లౌడ్-రేడియో ఆక్సెస్ నెట్వర్క్స్' గ్రంథానికి డాక్టరేట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మంచి ప్రొఫైల్ డెవలప్‌చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు: విద్యార్థులందరూ చదువులో మాత్రమే కాకుండా సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటేనే మంచి ప్రొఫైల్ డెవలప్ అవుతుందని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బుధవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రొఫైల్ డెవలప్ చేసుకుంటే జీవితంలో ఊహించలేనంత స్థాయికి ఎదుగుతారన్నారు. ఇప్పటివరకు విద్యార్థులు పరీక్షలు రాయడానికే మాత్రమే ప్రిపేర్ అయింటారని, ఇప్పటినుంచి మాత్రం జీవితంలో నెగ్గడానికి ప్రిపేర్ అవ్వాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

‘అమర్‌నాథ్’ దుండగులకు ఉరిశిక్ష వేయాలి

విశాలాంధ్ర-తెనాలి: బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, రాజోలు దగ్గర, ఉప్పలవారిపాలెం గ్రామానికి చెందిన అమర్‌నాథ్‌ను అతి దారుణంగా సజీవ దహనం చేసిన దుండగులకు ఉరిశిక్ష వేయాలని వివిధ మహిళా సంఘాలు వేరు వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. తెనాలి, కొత్తపేట మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అత్యవసర సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశానికి సంస్థ అధ్యక్షురాలు కె.రాధిక అధ్యక్షత వహించారు. మహిళా సంఘం కన్వీనర్ అనూరాధ మాట్లాడుతూ ఈ సంఘటన ఘోరాతి ఘోరం అని భవిష్యత్తులో మరల జరగకుండా ఉండేందకు నిందితులకు ఉరిశిక్ష వేయాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ సెక్షన్స్‌లో ఉన్న అన్ని సెక్షన్లను అమలు పరచేందుకు తీవ్ర కృషి చేయాలని చెప్పారు. అన్ని మహిళా సంఘాలు కలిసి నిరసనలు, ఉద్యమాలు చేయా ల్సిన అవసరం ఉందని అందుకు అందరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఇస్కఫ్ నాయకురాలు శోభారాణి మాట్లాడుతూ ఇలాంటి దుర్మార్గపు చర్య భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే దుండగులను బహిరంగంగా ఉరి తీయాలని కోరారు. మేరీక్యాథరిన్, సుజాత, రమణ, కరుణ, సామ్రాజ్యం, శివకుమారి పాల్గొన్నారు.

యాసిడ్ దాడికి గురైన ఫ్రాన్సిక మృతి

విశాలాంధ్ర-తాడేపల్లి: గత మంగళవారం యాసిడ్ దాడికి గురైన ఎడ్ల ఫ్రాన్సిక(35) అనే మహిళ చికిత్స పొందుతూ బుధవారం మణిపాల్ హాస్పిటల్లో మృతి చెందింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని డెంటల్ మెడికల్ కాలేజీలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న ఫ్రాన్సిక మీద గత మంగళ వారం గుర్తుతెలియని దుండగులు యాసిడ్‌తో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆమె రెండు కళ్ళు పోయాయి. బుధవారం ఆమె చికిత్స తీసుకుంటూ మృతి చెందింది. గత మంగళవారం రాత్రి డ్యూటీ అయిపోయి ఇంటికి టూ వీలర్ మీద వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి సమీపంలోనే యాసిడ్ దాడి చేశారు. దీంతో ఆమె తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి మణిపాల్ ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ ఫ్రాన్సిక బుధవారం ఉదయం చనిపోయింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

విద్యుత్ ఛార్జీలు పెంపును నిరసిస్తూ సీపీఐ ధర్నా

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం చప్పుడు కాకుండా ఛాప కింద నీరుల ప్రజలపై విద్యుత్ బారాలను మోపడాన్ని నిరసిస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేట విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజానీకంపై విద్యుత్ బారాలు మోపడం బాధాకరమన్నారు. కేంద్రంలోని బిజెపికి వంత పాడుతూ రాష్ట్రంలో రైతులకు మోటర్లకి మీటర్లు పెట్టాలని నిర్ణయించడం సోషనీయమన్నారు. ఇచ్ఛాపురం నుంచి చిత్తూరు వరకు మోటార్లకు మీటర్లు పెట్టేందుకు అంగీకరించారని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో సైతం ఈ విధానాన్ని వ్యతిరేకిస్తుంటే, జగన్ ప్రభుత్వం వంత పాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. సిపిఐ జిల్లా నాయకులు ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ ప్రజలు కడుతున్న విద్యుత్ బిల్లులకు ట్రూ అప్ చార్జీలు అదనంగా వేశారని, ఇది చాలదన్నట్టు చాప కింద నీరుల విద్యుత్ ఛార్జీలను మోపుతున్న ప్రభుత్వం, ప్రజలకు మేలు చేస్తుంది అనుకోవడం పొరపాటేనన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్.దేవి, కోటి, అంజిరెడ్డి, గౌస్, ఆనంద్, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు, కార్మిక, విద్యార్థి, మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భారీ వర్షం... రోడ్లపైకి వర్షపు నీరు

విశాలాంధ్ర-గురజాల: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటలు కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. పలురోడ్లు వీధులు జలమయమయ్యాయి. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోకి భారీగా వర్షపు నీరు చేరింది. అదే విధంగా చిన్న మసీదు సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్, అక్షర స్కూల్ సమీపంలోని రోడ్లపైకి చేరిన వర్షపు నీరు చేరడంతో పట్టణ ప్రజలు కొంతమేరకు ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ కమిషనర్ తో సహా పలువురు సిబ్బంది వర్షంలోనే విధుల నిర్వహణ కొనసాగించారు. రోడ్లపై వర్షపు నీరు చేరిన ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండ మున్సిపల్ సిబ్బంది వర్షపు నీటిని కాలువలోకి మళ్లించారు.

ఘనంగా యోగాడే

విశాలాంధ్ర-వినుకొండ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి 204ఏ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని మెయిన్ బజార్లో గల వాసవి జిల్లా గవర్నర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యోగ గురువు అడగా లింగరాజు విచ్చేసి సభ్యుల చేత యోగ ఆసనాలు చేయించారు. అంతేకాకుండా నిత్యం యోగా సాధన వలన మనిషి యొక్క జీవన ప్రమాణాలు ఏ విధంగా పెరుగుతాయి అనే దానిమీద అవగాహన కలిగించారు. అదేవిధంగా ఒత్తిడి లేని జీవితం కోసం ప్రతినిత్యం అందరూ కూడా తప్పకుండా యోగా అభ్యసించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయటం వలన వివిధ మానసిక సమస్యలకు మరియు ఒత్తిడి లేని జీవితాన్ని పొందవచ్చునని తద్వారా మనం అనేక జబ్బులకు దూరంగా ఉండవచ్చునని తెలియజేశారు. అనంతరం యోగా గురువుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు క్యాబినెట్ కోశాధికారి జవాజి సువర్ణలక్ష్మి జోన్ చైర్మన్ దేవత వెంకట శైలజ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ గుడిపాటి లక్ష్మిరాజ్యం కన్నెగంఢ్ల సువర్చలాదేవి దేవి బిబిటి ఉష రామడుగు లక్ష్మి కారంశెట్టి రత్నాకర్ గర్రె అనిల్ మరియు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

గ్యాస్ తూకం తగ్గుదలపై ఫిర్యాదులు

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గం లోని పెదకంచర్ల గ్రామంలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు తూకం తగ్గుపై గ్రామస్తులు ఫిర్యాదులు మీడియా కథనాలు మేరకు అధికారులు మంగళవారం సాయంత్రం అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలోనే ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు కూడా గడపగడప కార్యక్రమంలో ఉండగా. సిలిండర్లో గ్యాస్ తగ్గించి రావడం పట్ల తక్షణ విచారణ చేపట్టి డీలర్లపై తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. దీంతో వినియోగదారులను సంబంధిత గ్యాస్ సిబ్బందిని ఆ ప్రాంతాలను పిలిపించి అధికారులు విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ పౌరసరఫరాల అధికారులు. ఏ ఎస్ ఓ. జమీర్ భాష. సి ఎస్ డి టి. విద్యాసాగర్. మరో అధికారి అల్లూరయ్య వినుకొండ తాసిల్దార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడ్డ వాతావరణం

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ పట్టణంలో బుధవారం మధ్యాహ్నం వర్షం కురిసి వాతావరణం ఒక్కసారిగా చల్ల పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నేటి వరకు మండుటెండలు వడ గాల్పులతో . వేడెక్కిన వినుకొండ. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నేటి వరకు వడ గాల్పులకు బెంబేలెత్తిన వృద్ధులు. చిన్నారులు కాస్త ఉపశమనం పొందారు. కాగా బుదవారం కురిసిన వర్షానికి గాలికి. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక వర్షపు నీరంతా రోడ్ల పక్కన చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే భారీగా వీచిన గాలులకు ప్రధాన సెంటర్లో ఉన్న ఫ్లెక్సీలు ఒరిగిపోయాయి. అలాగే పలు వ్యాపార ప్రకటన బోర్డులు కూడా పడిపోయాయి. మొత్తానికి వాతావరణం చల్లబడటంతో సామాన్య ప్రజలు ఊపిరి పీల్చుకోవటంతో పాటు ఉన్నత వర్గాలు హమ్మయ్య ఇక ఏసీలు వేసుకునే పని లేదు లే అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-శావల్యాపురం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇలింద్రపర్తి విశ్వనాథ్ అన్నారు. భారతీయ రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆల్ ఇండియా స్కూల్ క్విజ్ ను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని ఐదు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొనగా మొదటి స్థానాన్ని వేల్పూరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు పొత్తూరి సాయి సుభాష్, జ్యోతి స్వామి వివేకానంద, రెండవ స్థానాన్ని పొట్లూరు హై స్కూల్ కి చెందిన మణికంఠ, దినేష్, మూడవ స్థానాన్ని శావల్యాపురం హైస్కూల్ కు చెందిన చంద్రశేఖర్, గాయత్రిలు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రంతోపాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

విశాలాంధ్ర-శావల్యాపురం: యోగ మానసిక, శారీరిక దృఢత్వానికి ఎంతగానో దోహదపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలం లోని వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల పిడి కాకుమాను రాజేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తమ జీవన విధానంలో యోగాకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తుంటే మానసిక ప్రశాంతతతో పాటు, మంచి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించేందుకు యోగ మంచి సాధనమని సూచించారు. పిఎంసీ చైర్మన్ పలపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మరియదాసు శివరామకృష్ణ, జ్యోతి శ్రీనివాసరావు, రత్నలత, హరీష పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

విశాలాంధ్ర-గురజాల: ఉన్నతమైన చదువులు చదవడానికి పేదరికం అడ్డుపడకూడదు అని చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, టిడిపి సీనియర్ నాయకుడు డా.చల్లగుండ్ల శ్రీనివాస్ అన్నారు. దాచేపల్లి పట్టణానికి చెందిన షేక్ మహ్మద్ సాద్, గురజాల పట్టణానికి చెందిన కొత్తా అఖిల ప్రణతికి ఉన్నత చదువుల నిమిత్తం చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ తరపున బుధవారం ఆర్థిక ప్రోత్సాహకం అందించారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అక్షాంక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-పొన్నూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాల వినియోగంపై బుధవారం పొన్నూరు మండలంలోని దండమూడి గ్రామం ఓసీ కేంద్రంలో అవగాహన ర్యాలీ కార్యక్రమం జరిగింది. అంగన్వాడి కేంద్రం కార్యకర్త పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్య, ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం తదితర కార్యక్రమాలను కేంద్రాలలో చేపడుతున్నారని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రత్యేకమైన ఆరోగ్య పరిరక్షణ అందిస్తున్నామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు నయీం భాషా, ఆయా, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

మెప్మా, డీఆర్‌డీఏల పనితీరు మెరుగుపడాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రభుత్వ సహకారంతో కొనసాగుతున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థల పనితీరు మరింత మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. నరసరావుపేట కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా నవరత్నాలు-సంక్షేమ పథకాల అమలులో భాగంగా మెప్మా ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పల్నాడు జిల్లా డి.ఆర్.డి.ఏ వై.యస్సార్ క్రాంతి పదం-జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరుపైన కూడా జిల్లా కలెక్టర్ సమీక్షలో చర్చించారు. ఇరు శాఖల ప్రాజెక్టు డైరెక్టర్లు పల్నాడు జిల్లాలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను జిల్లా కలెక్టర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ పథకాలను 100 శాతం ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని, ఈ పథకాల్లో తరచుగా వస్తున్న సాంకేతిక సమస్యలను అధిగమించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డి.ఆర్.డి.ఏ. వైయస్సార్ క్రాంతి పదం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలు నాయక్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట నారాయణ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో భారీ వర్షం

విశాలాంధ్ర-పెదనందిపాడు: మండల పరిధిలో తొలకరి వర్షాలు భారీ వర్షంతో ప్రారంభమైంది వాగులు వంకలు నిండుగా ప్రవహిస్తున్నాయి బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో రైతాంగం వ్యవసాయ పనులకు సిద్ధమై ఉన్నారు వ్యవసాయ పనులకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమాజంలో దివ్యాంగులూ దివ్యమైన వారే

విశాలాంధ్ర-మంగళగిరి: సమాజంలో దివ్యాంగులు కూడా దివ్యమైన వారేనని, వారికి పూర్తిస్థాయిలో అండగా ఉండాలని ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాల్లో భాగంగా మూడు చక్రాల స్కూటీల ను అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు లు పేర్కొన్నారు. నగరంలోని ఆటోనగర్ లో గల ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మూడు చక్రాల స్కూటీ లను లబ్ధిదారులకు అందజేశారు. సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు లు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తూ ఈ విధాల అండగా నిలుస్తుందని, ఈ నేపథ్యంలో మరో అడుగు ముందుకేసి సుమారు రూ.1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షల విలువైన ఎనిమిది మూడు చక్రాల స్కూటీ లను నియోజకవర్గ పరిధిలోని పలువురు దివ్యాంగులకు కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం లబ్ధిదారులకు మంజూరు చేయడం జరిగిందన్నారు. దివ్యాంగులు ఇంకా ఎవరైనా ఉంటే వారు తమ తమ వలంటీర్ల ద్వారా మూడు చక్రాల వాహనాలకు దరఖాస్తు చేసుకోవాలని, భవిష్యత్తులో కొందరు దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. మూడు చక్రాల వాహనాల మంజూరుకు కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయనే విషయాన్ని దివ్యాంగులు గుర్తెరిగి దరఖాస్తులు చేసుకుంటే జగనన్న కచ్చితంగా మూడు చక్రాల వాహనాలను మంజూరు చేసి అండగా ఉంటారని వారు హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు మూడు చక్రాలు వాహనాలను అందజేయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు వారి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

డాలర్ సిటీపై విచారణ

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని మార్కాపురం రోడ్డు పసుపులేరు బ్రిడ్జి వద్ద వివాదాస్పదంగా మారిన భూములపై తాసిల్దార్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం విచారణ నిర్వహించారు. తిమ్మాయపాలెం గ్రామంలోని పసుపులేరు బ్రిడ్జి వద్దగల సర్వే నంబర్ 717/5, 720/4-1, 720/4-2, 720/4-4, 721, 722/1 ,739/1, 741/13 మొదలగు నెంబర్లలోని భూమిని సమగ్ర విచారణ జరిపి నివేదికను ఇవ్వవలసినదిగా జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత సర్వే నెంబర్లలో ఉన్న వారికి తాసిల్దార్ నోటీసులు జారీ చేశారు. రైతులు వారి వద్ద ఉన్న ఆధారములతో తహసిల్దార్ కార్యాలయం వద్దకు విచారణకు హాజరయ్యారు. రెవెన్యూ అధికారులు 23 మందికి నోటీసులు జారీ చేయగా 17 మంది హాజరయ్యి వారి వద్ద ఉన్న హక్కు పత్రములు సమర్పించిగా రెవెన్యూ అధికారులు పరిశీలించి స్టేట్ మెంట్లు రికార్డు చేశారు. భూమికి సంబం ధించిన రెవిన్యూ రికార్డులు పరిశీలించిన పిదప సమగ్ర నివేదిక జిల్లా కలెక్టర్ కి పంపడం జరుగుతుందని తహశీదార్ కిరణ్ కుమార్ తెలిపారు.

పొన్నూరు ఎంపీడీఓగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు మండలం ఎంపీడీవోగా అడిగొప్పల శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. తుళ్లూరు మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పొన్నూరు ఎంపీడీవోగా బదిలీ అయినట్లు శ్రీనివాసరావు తెలిపారు. కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో శ్రీనివాసరావుకు పూలమాలలు అందించి స్వాగతం పలికారు.

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు పట్టణంలో బుధవారం ప్రపంచ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ వీరాంజనేయ యోగ సాధన సేవ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యోగాసనాచార్య మలిశెట్టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విపరీత ధోరణులు పెరిగి ఆలోచన శక్తి నశించి దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలుతున్నాయని, దీనికి సరైన పరిష్కారం యోగయేనని అన్నారు. యోగాసనాల ద్వారా జీవన ప్రమాణం పెరిగి మానసిక వత్తుడులు దూరమౌతాయని సూచించారు. ర్యాలీలో ఆరోగ్యమే మహాభాగ్యం, యోగాసనాలు చేయండి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ కాజా మొహిద్దిన్, పోత్తూరి సత్య శ్రీనివాస్, దమ్మాల వెంకటేశ్వరరావు, ఎస్కే మీరా బాబా తదితరులు పాల్గొన్నారు.

కాపు ద్రోహి ముద్రగడ

విశాలాంధ్ర-పొన్నూరు: కాపు కులంలో పుట్టి యావత్ కాపు లందరికీ ద్రోహం చేస్తున్న కాపు నాయకుడు, మాజీ మంత్రి ముద్ర గడ్డ పద్మనాభం కాపులందరికీ క్షమాపణ చెప్పాలని పొన్నూరు జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్యాకేజీ కోసం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై అవాకులు చవాకులు పేలటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల చరిత్రలో కాపులకు ముద్రగడ్డ చేసినది ఏమీ లేదని వారు అన్నారు. రాబోయే ఎన్నికల్లో తన కుమారుడు ఒక సీటు, ముద్రగడ్డకు ఒక సీటు ఆశిస్తూ జనసేన నేతపై విమర్శించటం పరిపాటిగా మారిందని వారు గుర్తుచేశారు. ఇప్పటినుంచైనా కాపు నాయకుడుగా చెప్పుకొనే ముద్రగడ్డ పద్మనాభం నోరు అదుపులో పెట్టుకోవాలని లేదా తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పొన్నూరు జనసేన మండలాధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బారావు, పట్టణ ఉపాధ్యక్షుడు యర్రసాని నాగభూషణం, గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అప్పారావు, పొన్నూరు రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు యన్నం నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి తోటా నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి మిర్యాల చంద్రకాంత్, టౌన్ సెక్రటరీ చేబ్రోలు పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నోటీసులు తప్పని సరిగా అందజేయాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సమగ్ర భూసర్వే పథకం ద్వారా గ్రామాల్లో రైతులు ఎప్పటి నుండో ఎదుర్కొంటున్న భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కామవుతాయని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే కనక ప్రసాద్ రావు అన్నారు. మండల కేంద్రం శావల్యాపురం గ్రామ సచివాలయంలో జరుగుతున్న రీసర్వే రికార్డు పనులను ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే పార్థసారథితో కలసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 9(2) నోటీసులు ఇచ్చే ముందే భూవ్యత్యాసాలకు తావు లేకుండా చూడాలని, గ్రామాల బౌండరీలు ఖరారు చేసి మొత్తం విస్తీర్ణాన్ని లెక్కించి తర్వాత నమోదైన రైతుల విస్తీర్ణాలతో సరిచూసుకోవాలని, భూవ్యత్యాసాలు నమోదైన రైతుల జాబితాను డీటీలకు అప్పగిస్తే వారు వెంటనే విచారణ చేసి సరి చేస్తారని అన్నారు. రీసర్వేలో జాయింట్ పొలాలు విడగొట్టుకోవడం, చనిపోయినవారి పొలాలు వారసులకు బదిలీ చేయడం వంటివి పూర్తి చేయాలన్నారు. ఏడీ మాట్లాడుతూ శావల్యాపురం మండలంలో కనమర్లపూడి రెవిన్యూలో రీసర్వే పూర్తి కాగా, పొట్లూరు, వేల్పూరు, పిచికలపాలెం గ్రామాలలో 9(2) పత్రాలు పంపిణీ చేస్తున్నామని, శానంపూడిలో రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. తహసీల్దార్ జాన్ సైదులు, డీటీలు వెంకట నాగరాజు, నాసరయ్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర-తెనాలి: పట్టణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వైశ్యవిద్యానిధి ప్రాంగణంలో బుధవారం శ్రీ ఆంజనేయం ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రముఖ కార్డియాలజిస్టు డా॥దక్షిణామూర్తి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. గుండెకు సంబంధించి వచ్చే జబ్బులపై ప్రజలు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆయన బాల్యంలో ఉన్నపైడు వయస్సు పైబడిన వారికే గుండె జబ్బులు వచ్చేదని, ఇప్పుడు వయస్సుతో సంబంధం లేకుండా అందరికి కామన్‌గా హర్ట్ అటాక్‌కు గురౌతున్నారని అన్నారు. వ్యాయమం, యోగా చేయడం వలన కొంతమేర వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. తెనాలి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి రాజశేఖర్ మాట్లాడుతూ యోగాతో మనస్సుకు ప్రశాంతత చేరూకుతుందని ప్రపంచ వ్యాప్తంగా యోగాను అందరూ అనుసరిస్తున్నారని అన్నారు. కీ.శే.డా॥కె.వి. సత్యలక్ష్మి మాతాజీ జ్ఞాపకార్థం ఉత్తమ నర్సింగ్ అవార్డు ప్రధానం ముగ్గురు నర్సులకు రూ.3,500/-లు నగదు, సర్టిఫికెట్ బహూ కరించారు. ఐనంపూడి శరత్‌బాబు, అన్నవరపు సత్యనారాయణ, కోనా రాఘవయ్య, సూపరింటెండెంట్ 11వ అదనపు జిల్లా కోర్టు, యోగా సభ్యులు, యోగా సాధకులు పాల్గొన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీవెంకటేశ్వర యోగా సేవ సమితి ఆధ్వర్యంలో కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య అధ్యక్షతన ఆలపాటి వెంకట్రామయ్య పురపాలక పాఠశాలనందు యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యోగా యొక్క విశిష్టతను యోగా ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యమును పెంపొందించుకొనుట గురించి రమణయ్య వివరించారు. విద్యార్థులచే యోగాసనాలు వేయించి, అభ్యాసం చేయించారు. బోధకుడు కోనల బాపిలాల్ ఆసనములు వేసి విద్యార్థులకు నేర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోనూరు పద్మావతి, ఉపాధ్యాయులు యం.వైష్ణవి, లావణ్య, హర్షిత, గాయత్రీదేవి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఏఎస్ఎన్ కాలేజీ విద్యార్థులు

విశాలాంధ్ర-తెనాలి: తెనాలి, ప్రకాశం రోడ్డులోని ఎయస్ఎన్ డిగ్రీ కాలేజి విద్యార్థులు ఐటీ, బీపీఓ ఉద్యోగాలకు 54 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉద్యోగాలను సాధించారు. ఈ సందర్భంగా తెనాలి శాసన సభ్యులు, ఎయస్ఎన్ విద్యాసంస్థల ఛైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఐటీ రంగంలో ఏర్పడిన మాంద్యం పరిస్థితుల్లో బహుళజాతి ఐటీ కంపెనీలు ఉద్యోగాలను తగ్గించుకుంటున్నాయి. దీని ఫలితంగా అభ్యర్థులకు పోటీ పెరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో తమ విద్యార్థులు 54 మంది టీసిఎస్ కంపెనీలో బీపీఓ, ఐటీ ఉద్యోగాలను సాధించడం విశేషమని చెప్పారు. కాలేజి ప్రిన్సిపల్ కొలసాని రామ్‌చంద్‌లు ఐటీ రంగంలో నెలకొన్న పరిస్థితులను ముందే అంచనా వేసి, పోటిని ఎదుర్కొనేలా గత ఆర్నెల్లుగా తగిన శిక్షణనివ్వడం వల్లనే తమ విద్యార్థులు ఉద్యోగాలను సాధించగలిగారని చెప్పారు. కాలేజీలో చేరిన ప్రతి విద్యార్థికి ఫైనలియర్‌లో ఉద్యోగం లభించాలన్నదే యాజమాన్యం ఉద్దేశమన్నారు. కాలేజి యాజమాన్యం ఆశయానికి తగట్టుగా తొలి ఏడాది నుంచి ఫైనలియర్ విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణనిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులను పలు సర్టిఫికెట్ కోర్సులు చేసేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవితం గడపాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆరోగ్యానికి ఆహారం ఎంత ముఖ్యమో, మనసుకి ధ్యానం అంతే ముఖ్యమని... ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకుని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని మాజీ మంత్రి కన్నా లక్ష్మి నారాయణ అన్నారు. బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భముగా జిల్లా పార్టీ కార్యాలయంలో యోగా గురువు ఆళ్ళ రాజేశ్వరరావు అధ్యక్షతన యోగా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన కన్నా లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ప్రాచీన భారతదేశ సంస్కృతి ప్రతిబింబమైన యోగా అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత పొంది ప్రపంచ దేశాలలో కొనియాడబడటం భారతీయులు గర్వించదగ్గ విషయమని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే యోగా ప్రాముఖ్యతను రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ ఆచరించి ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేస్తామని తెలిపారు. టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ చేసే పని పట్ల ఏకాగ్రత, నైపుణ్యం పెరగాలంటే యోగా చేయడం ద్వారానే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్య యోగా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి భైను మల్లికార్జునరావు, కూనంనేని వెంకటరమణ, యం.ప్రసాద్, డి.శంకర్, డి.దేవి, కె.లక్ష్మి, వై.అంకమ్మరావు, జిజ్జురి శ్రీనివాసరావు, యోగా గురువులు, యోగా సాధకులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల చూపు టీడీపీ వైపు

విశాలాంధ్ర-గుంటూరు: రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలందరూ తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు తెలుగుదేశం పార్టీకి సంపూర్ణ మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ గుంటూరు తూర్పు మైనార్టీ నాయకులు సయ్యద్ ముజీబ్ ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల ఉన్నతికి తెలుగుదేశం పార్టీ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఇచ్చిన ప్రాధాన్యత ఏ ప్రభుత్వం కూడా ఇవ్వలేదని అన్నారు. ఇమామ్, మౌజన్లకు దేశంలోనే తొలిసారి గౌరవవేతనం అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. పేదరికంలో మగ్గిపోతున్న ముస్లిం యువతకు స్వయం ఉపాధి కింద ఒక్కొక్కరికి రూ.3 లక్షల రుణం అందించి, రూ.లక్ష సబ్సిడీ అందించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలను అన్ని విధాలా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమేగాక తమకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించిన వారిపై దాడులు, హత్యలకు తెగబడుతున్నారని విమర్శించారు. జగన్ పాలనలో మైనారిటీల ఆస్తులకు కూడా రక్షణ లేకుండా పోయిందని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మైనారిటీల ఆస్తులకు రక్షణ కల్పిస్తామని, మైనారిటీల స్వావలంబనకు ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు, అర్హులైన పేద ముస్లింలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి నారా లోకేష్ హామీ ఇచ్చిన విషయాన్ని ముజీబ్ గుర్తుచేశారు.

పచ్చిరొట్ట పైర్లతో భూసారాన్ని పెంచుకోవచ్చు

విశాలాంధ్ర-నూజెండ్ల: పచ్చిరొట్ట పైర్ల సాగుతో నేల సారవంతం అవుతుందని మండల వ్యవసాయ అధికారి షేక్ సుగుణా బేగం అన్నారు. మండలంలోని తలర్లపల్లి రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్ల సాగుతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చునని తద్వారా పెట్టుబడులు తగ్గుతాయన్నారు. పచ్చిరొట్ట పైర్ల ప్రాధాన్యం రైతులు గుర్తిస్తే సాగు భూములు ఆరోగ్యంగా మారుతాయని తెలిపారు.కౌలు రైతులు పంటసాగు హక్కుపత్రాలు పొందాలని వీటి ద్వారా సాగు భూమిలేని ఎస్సి,ఎస్టీ,బీసీ మరియు మైనార్టీ వర్గాల రైతులకు రైతు భరోసా పథకం,పంటల భీమా,మద్దతు ధరకు పంట ఉత్పత్తులు కొనుగోలు, పంట నష్టపరిహారం,తదితర పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు.అనంతరం ఆర్బికే నందు 50 శాతం రాయితీ పై జీలుగ,జనుము,పిల్లిపేసర విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి యల్.ఎలీషా, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.రేవంత్ పాల్గొన్నారు.

యోగా జీవన విధానం కావాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: యోగాతో శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగా జీవన విధానం కావాలని ఎఫ్.సి.ఐ. డివిజనల్ మేనేజర్ దుష్యంత్ అన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి కృష్ణ కెనాల్ జంక్షన్ ఎఫ్.సి.ఐ.గౌడన్ లో ప్రత్యేక యోగా శిక్షణా శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఫ్ సి ఐ డివిజనల్ మేనేజర్ దుష్యంత్ పాల్గొని మాట్లాడుతూ యోగా శారీరక దృఢత్వానికి, ధ్యానం మానసిక ఉల్లాసానికి ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రతినిత్యం సాధన చేయడంతో ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవచ్చని సూచించారు.యోగాను ప్రతి ఒక్కరూ జీవన విధానంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.యోగాతో అన్ని రకాల వ్యాధులకు చెక్ పెట్టవచ్చు అన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర-బాపట్ల రూరల్: రుణాలు పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో రాధాకృష్ణ తెలిపారు. వైఎస్ఆర్ క్రాంతి పథం 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్రెడిట్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది బాపట్ల మండలం నుంచి 6200 మందికి యూనిట్ల ఏర్పాటు చేయటానికి రూ. 83 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ ఏఈఓ ప్రశాంతి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సంబంధించి 5 మందితో గ్రూప్ ఏర్పాటు చేసుకొని వ్యవసాయ శాఖ అందించే పరికరాలు ఏమైనా కూడా 40 శాతం సబ్సిడీతో పొందవచ్చన్నారు. మత్స్యశాఖ సిబ్బంది జి.మరియ దాసు మాట్లాడుతూ ఫిష్ ఆంధ్ర యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీతో ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.పశుసంవర్థక శాఖ నుండి పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అలానే డైరీ యూనిట్ ఏర్పాటుకు 35 శాతం శాతం సబ్సిడీతో అవకాశం ఉందన్నారు. వైఎస్ఆర్ క్రాంతి పదం ఏపీఎం డి.సురేష్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా సబ్సిడీతో కూడిన యూనిట్లతో పాటుగా కిరాణా వస్త్ర వ్యాపారం చిరు వ్యాపారాలు చేసుకునే వారికి గేదెలు గొర్రెలు కొనుగోలు చేసుకునేందుకు తక్కువ వడ్డీతో బ్యాంకుల ద్వారా వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిసిలు సుమలత, రత్నరాజు, శివరాం ప్రసాద్, ప్రకాష్ వెల్ఫేర్ అసిస్టెంట్లు వీఏఏలు పాల్గొన్నారు.

చదువుతో జీవితాలను చక్కదిద్దుకోండి: కలెక్టర్

విశాలాంధ్ర-మార్టూరు: కష్టపడి చదవి జీవితాలను చక్కగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. మార్టూరు మండలం ఇసుకదర్శి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.59 కోట్ల నిధులతో చేపట్టిన నాడు-నేడు పాఠశాల అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. జరుగుతున్న మరమ్మత్తు అభివృద్ధి పనులను సందర్శించారు. జగనన్న విద్యా కానుక కిట్లు, అందులోని వస్తువుల పంపిణీని పరిశీలించారు. పాఠశాలకు సమకూరుతున్న వసరులపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, ఆదనపు తరగతి గదులు, ఫర్నిచర్ వంటి వనరులను పరిశీలించారు. విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఉపాధ్యాయుడి మాదిరిగా జిల్లా కలెక్టర్ పాఠ్యాంశాలు బోధించారు. చాక్పీస్ తీసుకొని నల్ల బోర్డుపై రాస్తూ గణిత శాస్త్రాన్ని బోధించారు. లెక్కలు చెబుతూ విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. చదవడంలో చిన్నారులు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. బాగా చదవగలననే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి, ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడరాదన్నారు. ఆయన వెంట బాపట్ల ఆర్డిఓ జి.రవీందర్, ఎంఈఓ, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన కల్పించాలి

జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మార్టూరు మండలంలో జిల్లా కలెక్టర్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఇసుక దర్శిలోని జగనన్న కాలనీ, మార్టూరులోని జగనన్న కాలనీ, రైతు భరోసా కేంద్ర, గ్రామ సచివాలయాలను ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్ని ప్రజలకు చేరువయ్యేలా ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయంలో నమోదవుతున్న అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు తక్షణమే జారీ చేయడానికి సిద్ధం చేసుకోవాలన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు తక్షణమే జారీ చేయాలని, అధికారులు ప్రణాళిక అబద్ధంగా పనిచేయాలన్నారు.



ఆయన వెంట ఆర్డిఓ జి.రవీందర్, డీఎల్‌డీఓ సువార్త, గృహ నిర్మాణ శాఖ అధికారి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ బి.అర్జున్ రావు, తహసిల్దార్ వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

యోగాతో శారీరక మానసిక అభివృద్ధి

యోగాతో శారీరక, మానసిక అభివృద్ధి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా చెప్పారు. 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాపట్ల క్రీడా వికాస కేంద్రం ఆవరణలో జరిగింది. అధికారులు, విద్యార్థులు యోగ ఆసనాలు చేశారు. భారతదేశంలో యోగాకు ప్రాచీన కాలం నుంచి ఎంతో ప్రాచుర్యం ఉందని కలెక్టర్ తెలిపారు. యోగాతో మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించి ప్రతి ఒక్కరూ యోగపై దృష్టి సారించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, వ్యాధి నిరోధక శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ టి ఓ చంద్రశేఖర్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం మదన్ మోహన్, జల వనరుల శాఖ ఎస్ఈ మురళి కృష్ణ, ఎల్ డి ఎం శివకృష్ణా, అధికారులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు

విశాలాంధ్ర-చీరాల: పట్టణంలో బుధవారం కురిసిన వర్షానికి మసీదు సెంటర్ రోడ్డు చెరువును తలపించింది. ఈ కొద్దిపాటి వర్షానికే మోకాళ్ళ లోతుగా నీళ్లు నిలబడ్డాయి. పాద చారులు ద్విచక్ర వాహనదారులు, కారులో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఇప్పటికే పలువురు కుందేరు ఆక్రమణలు తొలగించి నీటి పారుదల సౌకర్యం కల్పించాలని అధికారుల చుట్టూరు ప్రదక్షిణలు చేస్తున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.బుధవారం కురిసిన వర్షంతో పరిస్తితులు నీరు నిలిచి చెరువులా మారాయి. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి చీరాల డ్రైనేజీ వ్యవస్థను సరిచేయలని చీరాల ప్రజలు కోరుకుంటున్నారు.

బల్లికురవ తహసీల్దార్‌గా రవిబాబు

విశాలాంధ్ర-బల్లికురవ: బల్లికురవ మండలం నూతన తహసీల్దార్‌గా కె.రవిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.రవిబాబు ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలంలో తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.ఇప్పటివరకు బల్లికురవ తాసిల్దార్ గా అద్దంకి తాసిల్దార్ సుబ్బారెడ్డి ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అద్దంకిలో వర్షం

విశాలాంధ్ర-అద్దంకి: అద్దంకి మండలంలో బుధవారం చిలుజల్లులతో కూడిన వర్షం పడింది. మధ్యాహ్నం 3గంటల నుండి 5గంటల కురిసింది. నెల రోజుల నుంచి వేసవి వడగాల్పులతో ఉక్కపోతతో ఉన్న జనజీవనానికి బుధవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది.రైతులు వర్షం కురవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

విశాలాంధ్ర-అద్దంకి: ప్రతిరోజు యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని కేఆర్కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి,మోహన రావు విద్యార్థులకు తెలిపారు. బుధవారం స్దానిక కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు.విద్యార్దులచే సూర్య నమస్కారాలు, యోగసనాలను వేయించారు. యోగాసనాల ప్రాముఖ్యత గురించి ప్రిన్సిపాల్ మోహనరావు వివరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్దులు పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర- కొరిశపాడు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన ఈనెల 28 తేదీన జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి డి సురేష్ బాబు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని గ్రామ సచివాలయ అధికారులు, హౌసింగ్ బోర్డు అధికారులు, విద్యాశాఖ, విద్యుత్ శాఖ ,జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అధికారులు, వెలుగు సిబ్బంది ఐసిడిఎస్ సిబ్బంది అందరూ తమ శాఖల అభివృద్ధి నివేదికల పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

రథయాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-యద్దనపూడి: ఈనెల 22న నియోజక వర్గంలో జరిగే భవిష్యత్తు గ్యారంటీ రథయాత్రను జయప్రదం చేయాలని టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. భవిష్యత్తు కోసం విడుదల చేసిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించేందుకు, అసమర్థ అరాచక పాలనపై ప్రజలను చైతన్యం చేసేందుకు చైతన్య రథయాత్రను చేపడుతున్నట్లు వివరించారు. అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, ప్రజలను మరింత చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. 23న యద్దనపూడి మండలంలో ఉదయం 9.00 నూతలపాడు గ్రామ దేవత పోలేరమ్మ తల్లి గుడి వద్ద ప్రత్యేక పూజలు, ఉదయం 9.30 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అనంతరం పూనూరు మీదుగా గన్నవరం మార్టూరు హైవే మీదుగా గ్రోత్ సెంటర్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర బల్లికురవ: రోజు ఒక గంట యోగ చేయడం ద్వారా శారీర దృఢత్వం, మానసిక దృఢత్వంతో పాటు సహజ సిద్ధమైన ఆరోగ్యానికి చక్కని మార్గమని ఎంపీడీవో సిహెచ్ కృష్ణ అన్నారు. బుధవారం బల్లికురవ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలని నిత్యం యోగాసనాలు చేయడం ద్వారా ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రమేష్ బాబు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

విశాలాంధ్ర-నిజాంపట్నం: నాటు సారా విక్రయిస్తున్న యువకుడిని అరెస్ట్ చేశామని నగరం సెబ్ సీఐ దేవర శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నిజాం పట్నం మండలంలోని అడవులదీవి గ్రామంలో దాడులు నిర్వహించి నాటు సారా విక్రయిస్తున్న బెల్లంకొండ లోకేష్ అనే యువకుడిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తునట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ వెంట నగరం సెబ్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు చూడటమే లక్ష్యం

విశాలాంధ్ర-బాపట్లరూరల్: పేదల జీవితాల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా జేసీఎస్ఎమ్ లక్ష్యమని సొసైటీ అధ్యక్షులు కన్నెగంటి జాన్‌వెస్లీ తెలిపారు. జె.సి.ఎస్.ఎమ్.సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో పేద ప్రజలకు ఆహారం ప్యాకేట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కారుమంచి ప్రభాకర్ రావు పుట్టినరోజు సందర్భంగా ప్రభాకర్ రావు అల్లుడు సహదేవుడు కుమార్తె కారుమంచి రవి కిరణ్ కుటుంబ సభ్యుల సహకారంతో దాదాపు 100 మంది పేదలకు అన్నదానం చేశారు.

ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోండి

విశాలాంధ్ర-చీరాల: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలని చీరాల యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఏ. వెంకట రవీంద్ర అన్నారు. జిల్లాలో ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత క్విజ్ 2023లో భాగంగా బుధవారం మండల స్థాయి క్విజ్ ని హైస్కూలు విద్యార్థులకి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల కొరకు బ్యాంకులు పనిచేస్తున్నాయని,బ్యాంకింగ్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల స్థాయి క్విజ్ పోటీల్లోఇపురుపాలెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ మునిసిపల్ హైస్కూలు,ఆంధ్ర రత్న మునిసిపల్ హైస్కూలు టీమ్ లు వరుసగా ప్రథమ,ద్వితీయ తృతీయ స్థానాలు సాధించాయని అన్నారు. గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు నగదు పురస్కారాలను అందజేశామని,జూన్ 28 న బాపట్లలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ రాజు,అసిస్టెంట్ మేనేజర్ బివి రమణమూర్తి,మండల కోఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి,కె సుశీల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక రంగాలపై అవగాహనుండాలి

విశాలాంధ్ర-యద్దనపూడి: ప్రతి విద్యార్థి బ్యాంకింగ్ ఆర్థిక రంగాలపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి 2 చెరుకూరు గోపి అన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు, ఏపీశాఖ యద్దనపూడి ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలల వారికి అఖిల భారత పాఠశాల క్విజ్ 2023 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలల్లో మార్టూరు ఉన్నత పాఠశాలకు చెందిన యు జాహ్నవి, జి.చందనలు ప్రథమ బహుమతి కోనంకి ఉన్నత పాఠశాలకు చెందిన యం నాగలక్ష్మి, డి.ప్రేమ్‌లు ద్వితీయ బహుమతి, అన్నంభొట్లవారిపాలెం, ఉన్నత పాఠశాలకు చెందిన ఏ.యశ్వంత్ కౌశిక్, ఐ.స్వరూపారాణిలు తృతీయ బహుమతి పొందారు. విజేతలకు ప్రశంసా పత్రాలు నగదు బహుమతులు అందజేస్తారు. క్విజ్ పోటీలు నిర్వ హించిన ఆర్.బి.ఐ వారిని ఎంఈఓ పుల్లెల సుబ్రమణ్యేశ్వరరావు అభినం దించారు. ఈ కార్యక్రమంలో యూబిఐ మార్టూరు, యద్దనపూడి , పర్చూరు శాఖల మేనేజర్లు జీవన్ రాజశేఖర్, సూర్యకాంత్ శర్మ , ప్రదీప్ కుమార్ లు యద్దనపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేంద్రరావు ఉపాధ్యాయుడు కాలేషావలి తదితరులు పాల్గొన్నారు .

కౌలు రైతు కార్డుపై అవగాహన

విశాలాంధ్ర-చెరుకుపల్లి: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కౌలు రైతులు విధిగా కౌలు రైతుల కార్డులు పొందా లని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ అన్నారు. బుధ వారం మండల పరిధిలోని బలుసులపాలెం తుమ్మలపాలెం గ్రామాలలో పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే కౌలు రైతు కార్డు తప్పక కలిగి ఉండాలన్నారు. దీనివలన రైతు భరోసా పంట నష్టం సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలు తదితర ఉపయోగాలు ఉన్నాయన్నారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కౌలు రైతు కార్డు పరిమితి 11 నెలలు మాత్రమే ఉండటం చేత అసలు రైతుకు ఎటువంటి నష్టం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలలో వీఆర్వోలతో సంబంధిత పత్రాలు అందించి కౌలు పొందాలన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు దాసరి మాధవి గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఆప్తమిత్ర సహకారం

విశాలాంధ్ర-రేపల్లె: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆప్త మిత్ర స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయం అని మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మంగ మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాల లలో 2022-23 సంవత్సరం 10 వ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయం అన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10 వేల నగదు, పాఠశాల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి రూ. 5 వేల నగదును పంపిణీ చేశారు. జూనియర్ కళాశాల నుండి రాష్ట్ర స్థాయి లో ప్రథమ స్థానం పొందిన అనిల్‌కు రూ.10 వేలు నగదు బహుమతి ఇచ్చారు. వైస్ చైర్మన్ విశ్వనాథ్ గుప్తా కమీషనర్ పార్థ సారధి,ఆప్తమిత్ర సభ్యులు గూడపాటి గోపాలకృష్ణ, ప్రసాద్, రవికిశోర్, రాగం. మాధవి పాల్గొన్నారు.

హత్యచేసిన దుండుగులను శిక్షించాలి

విశాలాంధ్ర-చీరాల: దేశంలో స్వాతంత్రం కొందరికే వచ్చిందని, నేటికి దళితులని చెట్టుకు కట్టేసి కొట్టే పరిస్థితులు ఉన్నాయంటే పాలకుల భావజాలం ఏ విధంగా ఉందో ప్రతి పౌరుడు ఆలోచించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని అన్నాడు. చీరాల గడియారస్తంభం కూడలిలో ఉత్తరప్రదేశ్‌లో దళితుడిని చంపిన ముద్దాయిలని అరెస్ట్ చేయాలని దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షేక్ జిలాని మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌లో దళితుడిని చంపిన దుండుగులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి దళిత క్రైస్తవులు, ముస్లింలకు దేశంలో రక్షణ కరువైందని,మతోన్మాద విధానాలతో పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి దళితుల ప్రాణాలంటే లెక్కలేకుండా పోయాయని ఆరోపించారు. నిందితులకు శిక్షపడి బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రసీద్, బుజ్జి,రబ్బానీ,ఉస్మాన్, ఖాలేషా పాల్గొన్నారు.

సీఈసీ ఆధ్వర్యంలో యోగా డే

విశాలాంధ్ర-వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఆధ్వర్యంలో 9వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణ రావు సంయుక్తముగా ఒక ప్రకటనలో తెలిపారు.కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యములో జరిగిన ఈ కార్యక్రమానికి యోగా గురువులు యస్.శివకోటేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొని సందేశం ఇచ్చారని కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణుగోపాలరావు తెలిపారు. దీర్ఘకాలంలో యోగాను మానవజీవన విదానములో భాగస్వామ్యము కల్పించుటకు చర్యలను తీసుకుంటున్నామని అన్నారు.

కౌలు రైతు కార్డులపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-వేటపాలెం: మండలంలోని దేశాయిపేట-2 రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతు కార్డులు గురించి అవగాహన సదస్సు జరిగింది. మండల వ్యవసాయ అధికారి కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కౌలు రైతు కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలని ప్రభుత్వం అందించేటువంటి పథకాలకు అర్హత పొందాలని సూచించారు. దేశాయిపేట -2 రైతు భరోసా కేంద్రంలో సాయిని బ్రహ్మయ్యకు కౌలు గుర్తింపు కార్డు జారీ చేశామన్నారు. ఇంకా కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలనుకునే వారు గ్రామ రెవెన్యూ అధికారిని, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ని సంప్రదించాలన్నారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలైనా జీలుగ విత్తనాలు 50 శాతం రాయితీతో రైతులకు అందుబాటులో ఉన్నాయని మండలంలో 11 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను అందజేశామన్నారు. మండల వ్యవసాయ అధికారి కాశీ విశ్వనాథ్, గ్రామ రెవెన్యూ అధికారి ఫక్రుద్దీన్, గ్రామ వ్యవసాయ సహాయకులు జి. కావ్య, గ్రామ వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యం. చెంచులు , కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

'కొప్పెరపాడు' విద్యార్థులకు ప్రథమ బహుమతి

విశాలాంధ్ర-బల్లికురవ: బల్లికురవ జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మండల స్థాయిలో ఆర్బిఐ ఆధ్వర్యంలో అఖిల భారత క్విజ్ కార్యక్రమం బుధ వారం నిర్వహించారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే క్విజ్ పోటీలలో మొత్తం 9 టీమ్‌లలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ క్విజ్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొప్పెరపాడు విద్యార్థులు కంబాల నాగసాయి చరణ్ తేజ,బత్తుల అభిరామ్‌ల టీమ్ ప్రథమ బహుమతి రూ. 5 వేలు , 2వ బహుమతి రూ. 4 వేలు సాయి టీమ్ బల్లికురవ జిల్లా పరిషత్ హైస్కూల్, 3వ బహుమతి భాస్కర్ రావు,సాయి తేజ టీమ్ రూ. 3 వేలు ఉపమాగులూరు జిల్లా పరిషత్ హైస్కూల్ సాధించారు.వీరికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్ద అంబటిపూడి మేనేజర్ అజిత్ నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ నెల 28 వ తేదిన బాపట్లలో జరుగు జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో బల్లికురవ మండలం తరపున కొప్పెరపాడు హైస్కూల్ విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పెరపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురంశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల, స్కూల్ కమిటీ చైర్మన్ దమ్ము అంజయ్య విద్యార్థులను అభినందించారు.

కౌలు రైతు కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-కొరిశపాడు: మండలం బొడ్డువానిపాలెం గ్రామంలో బుధవారం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతు కార్డుల సర్పంచి సుబ్బయ్య చేతుల మీదగా అందించినట్లు మండల వ్యవసాయ అధికారి పి శ్రీనివాసరావు తెలిపారు.వ్యవసాయం చేసే కౌలు రైతులందరూ పంట సాగు దారు పత్రాల కొరకు అధికారులను సంప్రదించి ప్రభుత్వ అందించే రాయితీలను పొంది వ్యవసాయ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉండాలని అన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో వైసీపీకి గుబులు

విశాలాంధ్ర-చీరాల రూరల్: మహానాడు సందర్భంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మ్యానిఫెస్టో తో వైకాపా ప్రభుత్వానికి గుబులు ప్రారంభమైందని, రానున్నది తెదేపా ప్రభుత్వమేనని చీరాల నియోజక వర్గ తెదేపా ఇంఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని ఈపురుపాలెం ఆటోనగర్ నుండి భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్రను ప్రారంభించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై తెదేపా ఎంఎల్‌సీ అనూరాధ, పర్చూరు శాసన సభ్యులు, జిల్లా తెదేపా అధ్యక్షులు ఏలూరి సాంబశివరావు, బాపట్ల ఇంఛార్జి నరేంద్ర వర్మ, కొనకళ్ళ నారాయణ, నాతాని ఉమామహేశ్వరరావు, శీరాం మాల్యాద్రి తదితర నాయకులతో సెల్ఫీలు దిగడానికి పోటీలు పడ్డారు. నాయకులు అందర్నీ ఉత్సాహ పరిచారు. శివాలయం, మసీదు, చర్చ్‌లలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. చేనేత సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ లోపున వర్షం పడటంతో చీరాల రోడ్లు జలమయ మయ్యాయి. ఆ నీటిలోనే చక్క రిక్షాపై ఏలూరి, కొండయ్య, నారాయణ తదితర నాయకులు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా చిన్న పాటి వర్షానికే నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడటంపై అసహనం వ్యక్తం చేశారు. ముక్కోణం పార్కు వద్దనున్న భారతరత్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వేటపాలెం మండలంలోని చల్లారెడ్డిపాలెం, కొణిజేటి చేనేతపురి కాలనీలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఓ.ఎమ్.బీ.నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, బాలకృష్ణ అభిమానులు, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

కుందేరు ఆక్రమణలు అరికట్టండి

విశాలాంధ్ర-చీరాల: చీరాలను అభివృద్ధి చేయండి మహాప్రభో అంటుంటే అధికారులు, కబ్జాదారులు కుమ్మక్కై కుందేరును ఆక్రమిస్తున్నారని చీరాల నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో కుందేరు ఆక్రమణలు ఆపాలని నిజ నిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో ఏఓకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ చీరాలను అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చి యధేచ్ఛక కుందేరును ఆక్రమిస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కుందేరు ప్రభుత్వ స్థలంలో ప్రయివేటు వ్యక్తులకు కాంట్రాక్టులు ఇచ్చి అధికారులే ఆక్రమణలు ప్రోత్సహిస్తున్నారని పూడిక తీసి పారుదల చేయాల్సింది పోయి ట్రాక్టర్లతో పుడుస్తున్నారన్నారు. చీరాలలో చిన్నపాటి వర్షానికే ఇప్పటికే పట్టణంలో రోడ్లు కాలువలౌతున్నాయని ఇప్పుడు కుందేరును పూడ్చి డెవలప్మెంట్ అంటే రాబోయే రోజుల్లో చీరాల నీటిలో మునిగిపోవడం ఖాయమన్నారు. కుందేరు డ్రైన్ పూడికలు తీయించి నీటి పారుదల జరిగేలా చర్యలు తీసుకోవాలని, రాకపోకల చప్టాలు శిథిలమైనందున పూడిక తీయించి తూములు ఏర్పాటు చేయాలన్నారు.2012లో అధికారులు 902 జీవోను అధి కారులు తీసుకొచ్చి కుందేరును ఆక్రమించే ప్రయత్నం చేయగా హైకోర్టును ఆశ్రయించిన చీరాల వసూలు ఘూ అశీ 114/2012ద్వారా జీవోను రద్దు చేశారని ఇప్పుడు కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని అధికారులు ఆక్రమణలు జరుగుతున్న నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజా వేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, బిఎస్పిజిల్లా కో ఆర్డినేటర్ భగత్ సింగ్, కేవీపిఎస్ నాయకులు జయరాజ్,దుడ్డు విజయ సుందర్,దొగుపర్తి కృష్ణ, డేవిడ్, అరవింద్, విజయ్, రామేశ్వరం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను జోడించి నేరాలు అదుపు చేయాలి

విశాలాంధ్ర-బాపట్ల: ప్రస్తుత సమాజంలో సాంకేతికత ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ సాంకేతికతను జోడించి నేరాలు అదుపు చేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ క్రమంలోనే భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టిన ఏపీ కాప్స్ అప్లికేషన్ కు సంబంధించి ఈ -బీట్స్ వ్యవస్థపై జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల కంప్యూటర్ ఆపరేటర్లకు ఇన్స్పెక్టర్ రైటర్లకు ఐటీ కోర్ ఆర్ఎస్ఐ సీజే భరత్ సిబ్బందితో కలిసి నేర నియంత్రణ, నేరచేదన సాంకేతికత ప్రయోజనంపై అవగాహన కల్గించారు. ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఐటీ కోర్ టీం విభాగంచే ఏపీ కాప్స్ ఈ బిట్స్ వ్యవస్థ విధానం ఉపయోగాలు, ఎలా అమలుపరచాలి అనే విషయాల మీద శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ప్రతిరోజు పెరిగిపోతున్న సైబర్ నేరాలు కట్టడి చేయటానికి తీసుకోవాల్సిన చర్యల గురించి జరిగిందని, కేవలం కంప్యూటర్ పనిచేసే పోలీస్ సిబ్బంది మాత్రమే కాకుండా ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది ఏపీ కాప్స్ అప్లికేషన్ గురించి అవగాహన పెంచుకోవాలని దీంతో ఉద్యోగం సులభతరం అవుతుందని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే సరైన విజయాలను సాధించగలుగుతామని, ప్రతి ఒక్క సిబ్బంది సాంకేతికత మీద దృష్టి పెట్టాలని తెలిపారు.జిల్లా లోని పోలీస్ అధికారులందరూ తమ పరిధిలో సిబ్బంది యొక్క మొబైల్ ఫోన్ లలో వాళ్ళ యొక్క CFMS ID, AP COPS అప్లికేషన్‌కు ఇన్ స్టాల్ చేయించి ఈ-బీట్ సిస్టమ్‌ను పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా హెడ్ క్వార్టర్ నుండి ఈ-బీట్ సిస్టమ్‌ను మానిటరింగ్ చేస్తుంటారన్నారు.